విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి

విద్యార్థిని మృతిపై సిబ్బందితో మాట్లాడుతున్న గోళి శ్రీనివాస్‌రెడ్డి

వెల్దండ, ఫిబ్రవరి 6 : మండలంలోని చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన ఆరాధ్య(16) విద్యార్థిని మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్నది. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి బాలానగర్ గురుకుల పాఠశాలకు చేరుకొని డీఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న గదిని పరిశీలించారు. అంతకుముందు దవాఖానలో విద్యార్థిని మృతదేహం వద్ద సంతాపం ప్రకటించారు. విద్యార్థినికి గదిలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకునే వరకు ఏమి చేస్తున్నారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేయాలని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడికి వచ్చిన విద్యార్థిని తల్లిదండ్రులను ఓదార్చారు.

వెల్దండ సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటయ్యగౌడ్, వెల్దండ మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, ప్రసాద్‌లు విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలించి, సంతాపం తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సబిత

వ్యాధిగ్రస్తులతో మాట్లాడుతున్న జడ్జి సబిత

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 6 : దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి సబిత అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని, ముఖ్యంగా మహిళలు గర్భాశయ, బెస్ట్ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌కు సంబంధించిన ప్రథమ చికిత్స ప్రభుత్వ దవాఖానలో చేయడం జరుగుతుందన్నారు. క్యాన్సర్‌పై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి గ్రామాల్లో పట్టణాల్లో సభలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రవి శంకర్, ఆర్ఎంవో అబ్దుల్ అజీమ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాసు, ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణమోహన్, మెడికల్ ఆఫీసర్స్, న్యాయవాదులు మధుసూదన్‌రావు, ఎస్ఆర్ సత్యనారాయణ, శ్యాంప్రసాద్‌రావు, లక్ష్మయ్య, న్యాయ శాఖ ఉద్యోగులు కేశవ రెడ్డి, రాజు, బాలరాజు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 6 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సామాజిక నాయకులు ఆకునమోని చంద్రయ్య అన్నారు. గురువారం ఆయన మండలంలోని రామాపురం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం జనవరి 26లోగా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలను ప్రారంభించినా ఇంత వరకు వాటిని ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమలు చేయాలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎకరాకు రూ.12వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఎకరాకు రూ.6వేలు మాత్రమే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే రామాపురం గ్రామానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ఇచ్చిన హామీలను వెంటనే అమలుపర్చాకుంటే ఈనెల 9వ తేదీన గ్రామంలో 'ప్రజా ఆవేదన' నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వెల్దండ : చెక్కు అందజేస్తున్న బృంగి దవాఖాన సిబ్బంది

వెల్దండ, ఫిబ్రవరి 6 : మండలంలోని కొట్ర గ్రామానికి చెందిన శ్యాంపూరి గణేశ్ ఇటీవల చారకొండ మండలం జూపల్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అయితే గణేశ్ పని చేస్తున్న బృంగి దవాఖాన యాజమాన్యం తరఫున రూ.2.50లక్షలు, దవాఖాన సిబ్బంది రూ.80వేల చొప్పున మొత్తం రూ.3.30లక్షల ఆర్థిక సాయాన్ని మృతుడు భార్య శివలీలకు గురువారం బృంగి దవాఖాన మార్కెటింగ్ మేనేజర్ అశోక్ రెడ్డి, సిబ్బంది అందజేశారు. వారి వెంట మల్లేశ్, లక్ష్మణ్, సత్యం ఉన్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి, ఫిబ్రవరి 6 : మండలంలోని మహదేవుని పేటలో రెండు రోజుల కిందట మృతి చెందిన యాదమ్మ కుటుంబానికి గురువారం బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు ఆర్థికసాయం అందజేశారు. వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భర్త ఉత్తయ్యకు రూ.15,300 అందజేశారు. పరామర్శించిన వారిలో కృష్ణ, బాలపీరు, రఫి, బాలస్వామి, వెంకటస్వామి ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కోడేరు, ఫిబ్రవరి 6 : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం అర్ధరాత్రి మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు మండల కేంద్రానికి చెందిన వట్టెల రాజు(42) బుధవారం రాత్రి తన కుటుంబ సభ్యులతో గొడవపడ్డారు. అందిరి తోపాటు రాజు కూడా రాత్రి భోజనం చేసి నిద్రించారు. తెల్లవారే సరికి రాజు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య తోపాటు ఇద్దరు సంతానం ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు దూరెడ్డి రఘువర్ధన్ రెడ్డి గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు.

కేసు నమోదు

లింగాల, ఫిబ్రవరి 6 : మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ తన పిల్లలతో అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ భార్యా పిల్లలతో కలిసి ఉంటున్నాడు. కాగా గత నెల 25వ తేదీన తన మామ (భార్య తండ్రి)తో గొడవపడి పిల్లలను తీసు కొని ఎక్కడికో వెళ్లి పోయినట్లు తెలిపారు. బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. మామను అడిగినా సమాధానం చెప్పడం లేదని న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు తులాల బంగారం చోరీ

లింగాల, ఫిబ్రవరి 6 : మండలంలోని అప్పాయిపల్లిలో రెండు తులాల బంగారం, రూ.75వేలు దొంగతనం జరిగిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై నాగరాజు కథనం మేరకు గ్రామానికి చెందిన ఫరీదా బేగం ఇంట్లో ఉన్న బీరువాలో ఈనెల 1వ తేదీన రెండు తులాల బంగారం, రూ.75వేల నగదును ఉంచింది. కాగా గురువారం వ్యవసాయ పొలాలకు వెళ్లి అవసరం బంగారం, నగదు చూడగా కనిపించలేదని ఫరీదా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ సంతోష్



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

కోడేరు, ఫిబ్రవరి 6 : ప్రభుత్వ దవాఖానల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ ఎంత మంది రోగులు దవాఖానకు వస్తున్నారని, దవాఖానలో నార్మల్ డెలివరీ ఎన్ని నమోదు అవుతున్నాయని డాక్టర్లు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నార్మల్ డెలివరీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని దవాఖానలో మందుల కొరత లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం దవాఖానలోని పలు విభాగాల గదులను పరిశీలించారు. అందుబాటులో లేని సిబ్బంది వివరాలను ఆరా తీశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ దవాఖాన పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకితభావంతో సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రావణ్‌కుమార్, తాసీల్దార్ విజయ్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో వెంకటరమణ, ఆర్ఐలు సురేందర్, జంబులయ్య ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. గురువారం మండల కేంద్రమైన కోడేరు, ఎత్తం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో వందశాతం మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు మొబైల్ ఫోన్లను బహుమతిగా అందజేస్తానని లేదా గుర్తింపు కలిగిన కాలేజీలో అడ్మిషన్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు ఆహార నాణ్యత వసతులు పరిశుభ్రత వంటి అంశాలను ఆయన స్వయంగా పరిశీలించి లోపాలను సరిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముందుగా మహాత్మాజ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడి విద్యార్థులకు అందుతున్న సదుపాలయాలను స్వయంగా పరిశీలించారు. పాఠశాలల్లో ఉన్న వసతులు విద్యార్థుల భద్రత ఆహార నాణ్యత గదుల పరిశుభ్రత మౌలిక సదుపాయాల స్థితిగతులను సమీక్షించారు. ఆహార పదార్థాలు కలుషిత కాకుండా ఉండేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఎత్తం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. 4వ తరగతిలో గణితం సామాన్యశాస్త్రం పాఠ్యాంశాల్లో విద్యార్థుల నుంచి జావా బుక్కును రాబట్టారు. అదేవిధంగా కోడేరు, ఎత్తం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రావణ్‌కుమార్, తాసీల్దార్ విజయ్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో వెంకటరమణ, ఆర్ఐలు సురేందర్, జంబులయ్య పాల్గొన్నారు.

భరోసా సెంటర్ సేవలు అభినందనీయం

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

భరోసా సెంటర్‌లో కేక్‌కట్ చేస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 6 : ఆపదకు లోనైన మహిళలు, యువతులను చేయూత అందించేందుకు ఏర్పాటు చేసిన భరోసా సెంటర్ సేవలు అభినందనీయమని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలో భరోసా సెంటర్ ఏర్పాటు చేసి నేటికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో కేక్‌కట్ చేసి సక్సెస్‌ఫుల్‌గా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వాహకులను ఎస్పీ ప్రశంసించారు. మహిళలపై కానీ, బాలికలపై కానీ లైంగికంగా కానీ, హింసకు గురైతే పోలీస్‌స్టేషన్‌లో చెప్పుకోలేని పరిస్థితులు ఉంటాయని, అలాంటి వారి కోసం భరోసా సెంటర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఏడాది కాలంగా ఈసెంటర్‌లో 89 కేసులకు సంబంధించి పూర్తి స్టేట్‌మెంట్ రికార్డు చేసి, మెడికల్ టెస్టులు చేసినట్లు వెల్లడించారు. ఇంకా ఐదు కిడ్నాప్ కేసులకు సంబంధించి భరోసా సెంటర్ వారు కౌన్సెలింగ్ ఇచ్చారని, వాటిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. భరోసా సెంటర్, సఖి, మహిళా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహిళలు, యువతులకు అవగాహన కల్పించనున్నారు. జనవరి 1 నుంచి నెలాఖరు వరకు ఆపరేషన్ స్మైల్ నిర్వహించగా, ఆపరేషన్ స్మైల్‌లో పోలీసులతోపాటు చైల్డ్ డిపార్ట్‌మెంట్, సఖి సెంటర్, లైన్ డిపార్ట్‌మెంట్ అందరూ కలిసి నెలరోజులపాటు కార్యక్రమాన్ని విజయవంతం చేశామని పేర్కొన్నారు. ప్రతి ఏడాది జనవరి, జూలై నెలల్లో ఆపరేషన్ స్మైల్ అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. నెలరోజులపాటు చేపట్టిన ఆపరేషన్ స్మైల్‌లో 33 మైనర్లను వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సీహెచ్.రామేశ్వర్, డీసీఆర్‌బీడీ ఎస్పీ సత్యనారాయణ, సీఐ కనకయ్య, ఎస్సై గోవర్ధన్, షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, భరోసా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిచయం లేని వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి

- జిల్లా షీటీం ఇన్‌చార్జి విజయలక్ష్మి

తాడూరు, ఫిబ్రవరి 6 : పరిచయం లేని వ్యక్తుల తోపాటు ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి నిత్యం అప్రమత్తంగా ఉండాలని జిల్లా షీటీం ఇన్‌చార్జ్ విజయలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని ఐతోల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో షీటీం, సఖి, ఫోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలియని వ్యక్తులు డైరెక్ట్‌గా వీడియో కాల్ చేసి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇన్‌స్టాలో పరిచయాల ద్వారా చాలా మంది యువతీ యువకులు తమ సమయాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. అలాగే భరోసా కేంద్రం కో ఆర్డినేటర్ శ్రీలత భరోసా యొక్క సేవలు, గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి వివరించారు. వేధింపులకు పాల్పడిన వారి వివరాలను తప్పకుండా పోలీసులకు తెలిపాలని కోరారు.

సఖి సెంటర్ అడ్మిన్ సునీత సఖి అందించే సేవలు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, షీటీం మెంబర్ వెంకటయ్య పాల్గొన్నారు.

నిజాయితీని చాటుకున్న సిబ్బంది

బాధితుడికి డబ్బును అందజేస్తున్న ఎస్సై గౌస్‌పాషా

నాగర్‌కర్నూల్‌టౌన్/నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 6 : జిల్లా కేంద్రంలోని డీఎస్పీ ఆఫీస్ పక్కన రెండు నెలల కిందట నెలకొల్పిన పోలీస్ వెల్ఫేర్ సొసైటీ వారి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ పోలీసులు, సిబ్బంది తమ నిజాయితీని చాటుకున్నారు. వివరాలోకి వెళ్తే.. నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన శ్రీనివాస్ తన సొంత జేసీబీ వెహికిల్‌కు బుధవారం రూ.9,400లు డిజిల్ పోయించారు. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించే క్రమంలో పొరపాటుగా రూ.93,400 చెల్లించారు. శ్రీనివాస్ తన ఇంటికి వెళ్లి ఫోన్‌లో డబ్బులు చెక్ చేసుకోగా పెట్రోల్ బంకులో పొరపాటున ఎక్కువ డబ్బులు చెల్లించానని ఎస్సై గౌస్‌పాషాకు సమాచారమందించారు. అదనంగా చెల్లించిన డబ్బులను వచ్చి తీసుకుపోవాల్సిందిగా శ్రీనివాస్‌కు ఎస్సై సూచించారు. అధనంగా చెల్లించిన డబ్బులను ఎస్సై గౌస్ పాషా సిబ్బంది ఆధ్వర్యంలో శ్రీనివాస్‌కు అందించి తమ నిజాయితీని చాటుకున్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

- కాంగ్రెస్ నాయకులే ప్రభుత్వ భూములు కబ్జా చేశారు
- బీఆర్ఎస్ నాయకుడు శేఖర్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

దోమలపెంట, ఫిబ్రవరి 6 : అమ్రాబాద్ మండలం దోమలపెంట బీఆర్ఎస్ నాయకులపై ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు శేఖర్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారెంటీల పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయడంలో చాతకాక ప్రజలను పక్క దారి పట్టించే విధంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ బీఆర్ఎస్ నాయకులపై ఆసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో ఇందిరమ్మ గృహాలు ఇస్తానని చేప్పి ఉన్న ఇండ్లను కాలి చేయించే పని మొదలు పెట్టడం సరైనది కాదన్నారు. ఎమ్మెల్యే మీ కాంగ్రెస్ నాయకులే ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, దానికి మీరు ఏ సమాదానం ఇస్తారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. గ్రామంలో 30 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న దాదాపు 600 కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు భయాందోళనకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెబుతారన్నారు. తప్పు ఎవరూ చేస్తున్నారో బహిరంగ చర్చకు ఎమ్మెల్యే సిద్ధమా అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిమ్మన్న, మాజీ ఉపసర్పంచ్ ప్రసాద్, అహ్మద్, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల ఇండ్లను కూల్చడం దుర్మార్గం

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు
- రెవెన్యూ కార్యాలయం ఎదుట బాధితులు ధర్నా

తాసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చార కొండ, ఫిబ్రవరి 6 : కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చార కొండ మండల కేంద్రంలో బైపాస్ రోడ్డు నిర్మాణంలో పేదల ఇండ్లను కూల్చడం దుర్మార్గమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బైపాస్ బాధితుల కూల్చిన ఇండ్లను సీపీఎం బృందం పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో బాధితులతో ర్యాలీగా వెళ్లి రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఉన్న రహదారి విస్తరిస్తే పేదలకు ఎలాంటి నష్టం ఉండదని అనేక సార్లు ఆందోళనలు చేపట్టిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. బాధితులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా భారీగా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసి వారి కళ్ల ముందే ఇళ్లను నెలమట్టం చేశారని మండిపడ్డారు. గతంలో ఇచ్చిన పరిహారానికి కనీసం వంద గజాల ఇంటి స్థలం రాని పరిస్థితి ఉందన్నారు. ప్రత్యామ్నాయం చూపియకుండానే కూల్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బాధితులకు ఇంటి స్థలంతో పాటు ఇంటిని నిర్మించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పరిహారం కింద బాధితులకు రూ.50లక్షలు ప్రతి కుటుంబానికి ఇవ్వాలన్నారు. ఈనెల 10న కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధితులతో కలిసి ముట్టడిస్తామన్నారు. అనంతరం తాసీల్దార్ సునీతకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆంజనేయులు, జిల్లా నేతలు ఏపీ మల్లయ్య, బాలస్వామి, మధు, బాధితులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 6 : విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు ఎంతో కీలకమని, దాని కోసం బాగా చదివి లక్ష్యాన్ని సాధించాలని నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దముద్దునూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోరిక మేరకు మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు బోర్డు ఎగ్జామ్ సన్నద్ధతకు విద్యార్థులకు రూ.15వేలు విలువ గల స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా సమయ స్ఫూర్తితో పరీక్షలు రాయాలని సూచించారు. మంచి మార్కులు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ స్వామి, సురభి, శ్రీకాంత్‌రావు, ఉప సర్పంచ్ భగవంతగౌడ్, గోపాల్‌రావు, ఈశ్వర్, భరత్‌కుమార్, మాధవ్, కోదండం, రాముడు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన వేడుకలు

చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న టీచర్

అమ్రాబాద్, ఫిబ్రవరి 6 : మండలంలోని బీకే లక్ష్మాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు నెలల చిన్నారులకు, అదేవిధంగా అంగన్‌వాడీలో పేరు నమోదైన చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో టీచర్ వల్లమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

సైబర్‌క్రైం మోసంపై కేసు నమోదు

చార కొండ, ఫిబ్రవరి 6: స్మార్ట్ ఫోన్‌లో ఓయాప్ ఓపెన్ చేసి కొంత డబ్బును ఇన్వెస్ట్ మెంట్ పెట్టి ఓవ్యక్తి మోసపోయిన ఘటన మండలంలోని జూపల్లిలో చోటు చేసుకున్నది. ఎస్సై శంషోద్దీన్ కథనం ప్రకారం మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన ఎండీ ఖాదర్ నుంచి అదే గ్రామానికి చెందిన ఎండీ రియాజ్ డెకా త్లాన్ అనే యాప్‌లో గత నెల 11న రూ.69వేలు పెట్టుబడి పెట్టడంతో సంబంధిత యాప్ క్యూఆర్ కోడ్‌ను చెల్లించితే ప్రతి రోజు రూ.4వేలు వస్తుందని వివరించి నమ్మించాడు. గత నెల 14న ట్యాక్సి కార్డు పేరుతో మళ్లీ రూ.9,500 క్యూఆర్ చెల్లించగా మరసటి రోజు నుంచి యాప్ క్లోజ్ అయింది. అప్పటి నుంచి యాప్ ఓపెన్ కాక పోవడంతో సైబర్ క్రైం నెంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయగా ఫలితం లేక పోవడంతో గురువారం బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పీఏసీసీఎస్‌లో విచారణ

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలోని గొరిట పీఏసీసీఎస్ బిజినేపల్లి డీసీసీబీ మేనేజర్ రాజ్యలక్ష్మి గురువారం విచారణ చేపట్టారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా గురువారం విండోను సందర్శించిన ఆమె లాంగ్‌టర్మ్ లోన్లు తీసుకున్న రైతులతో వివరాలు తెలుసుకున్నారు. స్థానిక సొసైటీపై నిధుల దుర్వినియోగం ఆరోపన నేపథ్యంలో అధికారులు విచారణను నిర్వహిస్తున్నారు. తేదీల్లో తేడాలున్నాయని, అధికారుల విచారణ అనంతరం వివరాలు తెలుస్తాయని తెలిపారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 6 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు నాగరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు మినహా ఏవి అమలు కాలేదన్నారు. కల్యాణలక్ష్మి పథకానికి తులం బంగారం, మహాలక్ష్మి పథకం లాంటివి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

స్థల పరిశీలన

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 6 : మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేయనున్న పెట్రోల్ పంపు నిర్మాణానికి స్థలాన్ని గురువారం నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో మేనేజర్ యాదయ్య పరిశీలించారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ పంపు కోసం స్థలం కరారు చేసేందుకు స్థానిక తాసీల్దార్ రామకృష్ణయ్యతో కలిసి పరిశీలించారు. ఆయనవెంట అధికారులు ఉన్నారు.

చెరువులో పడి మహిళ మృతి

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 6 : మండలంలోని శ్రీపురం చెరువులో ఓ మహిళ మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మే